RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

www.nityamnigha.com
RNI. TGTEL/25/A1665
నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక
NITYAM NIGHA TELUGU DAILY
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా
Published From : Warangal
Circulated at : Telangana All Districts



వరంగల్ | సంపుటి 2 | సంచిక 105 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | శనివారం | 17.10.2026 | పేజీలు : 8

జహీరాబాద్‌లో హ్యుందాయ్ భారీ పరిశోధనా కేంద్రం..

- సీఎం రేవంత్‌తో సంస్థ ఉన్నతస్థాయి బృందం భేటీ

- ₹8,528 కోట్ల పెట్టుబడితో తెలంగాణలో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు
- 4,275 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని సంస్థ వెల్లడి
- అనుమతులు వెంటనే మంజూరు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు
- రాష్ట్రంలో కార్ల తయారీ కర్మాగారాన్ని కూడా నెలకొల్పాలని హ్యుందాయ్‌కు పిలుపు



నిత్యం నిఘా, హైదరాబాద్ : తెలంగాణ పారిశ్రామిక రంగానికి మరో భారీ ఊపు లభించింది. ప్రముఖ వాహన తయారీ సంస్థ హ్యుందాయ్ మోటార్స్ సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పరిధిలో అత్యాధునిక పరిశోధనా కేంద్రాన్ని నెలకొల్పేందుకు సిద్ధమైంది. సుమారు ₹8,528 కోట్ల భారీ వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు ద్వారా దాదాపు 4,275 మందికి ఉద్యోగాలు లభించనున్నాయి.హ్యుందాయ్ మోటార్స్ ఇండియా ఇంజినీరింగ్ మేనేజింగ్ డైరెక్టర్ చాంగ్యో చో నేతృత్వంలోని ఉన్నతస్థాయి బృందం శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశమైంది. ఈ సందర్భంగా జహీరాబాద్‌లో ఏర్పాటు చేయనున్న ప్రాజెక్టు స్వరూపం, పెట్టుబడి ప్రతిపాదనలు, ఉద్యోగ కల్పన వివరాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. సంస్థ ప్రతిపాదనలపై సానుకూలంగా స్పందించిన రేవంత్ రెడ్డి, ఈ కేంద్రానికి అవసరమైన అన్ని అనుమతులను వేగవంతంగా జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.పరిశోధనా కేంద్రంతో పాటు రాష్ట్రంలో కార్ల తయారీ ప్లాంట్‌ను కూడా ప్రారంభించాలని హ్యుందాయ్ బృందాన్ని సీఎం కోరారు. కొత్త పరిశ్రమల స్థాపనకు తెలంగాణలో అత్యుత్తమ మౌలిక వసతులు, అనుకూల వాతావరణం ఉన్నాయని, ప్రభుత్వం తరఫున పూర్తి సహకారం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ ప్రాజెక్టు రాకతో జహీరాబాద్ ప్రాంతం కీలకమైన ఆటోమొబైల్ హబ్‌గా మరింత విస్తరించనుందని, స్థానిక యువతకు విస్తృత అవకాశాలు దక్కుతాయని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

ఇది కాంగ్రెస్ చేతగానితనం వల్ల వచ్చిన కరవు.. - కేటీఆర్



- తెలంగాణలో నీటి ఎద్దడికి కాంగ్రెస్ నిర్లక్ష్యమే కారణమని కేటీఆర్ ఆరోపణ
- 1,000 టీఎంసీల గోదావరి, కృష్ణా జలాలు వృథాగా దిగువకు వెళ్లాయని వ్యాఖ్య
- కన్నెపల్లి, దేవాదుల పంపులను సక్రమంగా వినియోగించలేదని విమర్శ

» 2

డిండి ప్రాజెక్టు రద్దు చేయకపోతే ఉద్యమమే : డీకే అరుణ హెచ్చరిక



- పాలమూరు నీటిని డిండికి తరలించి రైతులను మోసం చేస్తున్నారని డీకే అరుణ ఆరోపణ
- జిల్లాకు మేలు చేయనప్పుడు రేవంత్ రెడ్డికి సీఎం పదవి ఎందుకని ప్రశ్న
- పదేళ్లలో ఆర్డీఎస్‌కు కేసీఆర్ చేసిందేమీ లేదని విమర్శ

» 2



పిల్లల సోషల్ మీడియా భద్రత.. కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు

- సోషల్ మీడియా ముప్పు నుంచి పిల్లల రక్షణపై కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసు
- పటిష్ఠమైన నియంత్రణ, వయసు నిర్ధారణ ఉండాలని కోరిన పిటిషనర్లు
- ప్రస్తుత చట్టాలు సరిపోవని, పిల్లలపై తీవ్ర ప్రభావం పడుతోందని పిటిషన్‌లో వెల్లడి
- ఆన్‌లైన్ వేధింపులు, మానసిక ఆరోగ్యంపై పిటిషనర్ల ఆందోళన

» 2

ఈ నెలలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు..

- మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై కేంద్రం కసరత్తు!

- ఈ నెలలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించే అవకాశం
- మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై కేంద్రం దృష్టి
- ఏప్రిల్ 17న లోక్‌సభలో వీగిపోయిన రాజ్యాంగ సవరణ బిల్లు



నిత్యం నిఘా, న్యూ ఢిల్లీ : మహిళా రిజర్వేషన్లు, లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ నెలలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. లోక్‌సభలో ఈ బిల్లులను ఆమోదింపజేసేందుకు అవసరమైన మద్దతు తమకు ఉందని కేంద్రం ధీమాగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అంశాలపై ప్రతిపక్షాల నిరసనలు కొనసాగుతున్నాయి. ప్రతిపాదిత బిల్లులకు మద్దతు కూడగట్టేందుకు కేంద్రం ప్రతిపక్ష పార్టీలతోనూ చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఈ ఏడాది ఏప్రిల్ 17న బడ్జెట్ సమావేశాల సందర్భంగా నియోజకవర్గాల..

2

స్టార్‌లింక్‌తో పోటీకి సై.. మేం భయపడం

- మస్క్ వ్యాఖ్యలకు రిలయన్స్ కౌంటర్




- స్టార్‌లింక్ సహా అన్ని సంస్థలతో పోటీకి సిద్ధమన్న రిలయన్స్
- భారతీయ, విదేశీ సంస్థలకు ఒకే నిబంధనలు వర్తిస్తాయని వెల్లడి
- జియో ఉపగ్రహ సేవలకూ ఇంకా అనుమతులు రావాల్సి ఉందని ప్రకటన
- 2016లో ప్రారంభమైన జియోకు ప్రస్తుతం 53 కోట్లకు పైగా వినియోగదారులు

» 2

రేవంత్ సన్నిహితులకు మెడికవర్‌లో వాటాలు

- మన్నె క్రిశాంక్



- మెడికవర్ వ్యవహారంలో సీఎం రేవంత్‌కు మన్నె క్రిశాంక్ సవాల్
- సీఎం కుటుంబ సన్నిహితులకు వాటాలున్నాయంటూ ముగ్గురి పేర్ల వెల్లడి
- రూ.13,200 కోట్ల డీల్‌పై సీబీఐ విచారణ జరపాలని డిమాండ్

» 2

రాహుల్ తాటాకు చప్పుళ్లకు భయపడం

- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

- కేంద్ర ప్రభుత్వాన్ని కూల్చేందుకు విపక్షాలు కుట్ర చేస్తున్నాయని ఆరోపణ
- పది నెలల్లో మోదీ సర్కార్ పడిపోతుందని దుష్ప్రచారం చేస్తున్నారని విమర్శ
- 2029 వరకు మోదీ ప్రధానిగా ఉండాలని ప్రజలు తీర్పు ఇచ్చారని వ్యాఖ్య



వివరాలు 2 లో

ఖైరతాబాద్ ఉపఎన్నికలో బలమైన అభ్యర్థిని నిలబెడతాం : కవిత



- ఖైరతాబాద్ ఉపఎన్నికలో తమ పార్టీ కచ్చితంగా పోటీ చేస్తుందన్న కవిత
- రేవంత్ పాలన పక్కన పెట్టేశారని విమర్శ
- రాబోయే ఏడెనిమిది నెలల పాటు ప్రజల్లోనే ఉంటామని వెల్లడి

» 2

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

రాహుల్ తాటాకు చప్పుళ్లకు భయపడం
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

మొదటిపేజీ తరువాయి.. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వాన్ని అస్థిరపరిచేందుకు ప్రతిపక్షాలు కుట్రలు పన్నుతున్నాయని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తీవ్రంగా ఆరోపించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలను ఆయన "తాటాకు చప్పుళ్లు"గా అభివర్ణించారు. ప్రజా తీర్పును గౌరవించకుండా, దేశంలో అరాచకాన్ని సృష్టించి ప్రభుత్వాన్ని కూలదోయాలని విపక్షాలు పగటి కలలు కంటున్నాయని ఆయన ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యాంగం కల్పించిన ప్రజాస్వామ్య హక్కులను ప్రతిపక్షాలు దుర్వినియోగం చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. "పది నెలల్లో మోదీ ప్రభుత్వం కూలిపోతుంది" అంటూ కొన్ని పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించిన ఆయన, ఇది ప్రజాతీర్పును అవమానించడమేనని పేర్కొన్నారు. "ప్రధానిగా నరేంద్ర మోదీ 2029 వరకు కొనసాగాలని ప్రజలు స్పష్టమైన తీర్పునిచ్చారు. అయితే, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి దేశాల్లో ప్రభుత్వాలను మార్చి నట్లుగా ఇక్కడ కూడా చేయాలని ప్రతిపక్షాలు దింపుడుకల్లం ఆశలతో ఉన్నాయి. వారి ఆశలు ఎప్పటికీ నెరవేరవు" అని కిషన్‌రెడ్డి విమర్శించారు. ప్రపంచ దేశాలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్నప్పటికీ, ప్రధాని మోదీ నాయకత్వంలో భారతదేశం స్థిరంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వ పనితీరును చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. రాహుల్ గాంధీ చేసే తాటాకు చప్పుళ్లకు మోదీ ప్రభుత్వం భయపడదని, తమ ప్రభుత్వం అత్యంత స్థిరంగా ఉందని, పూర్తికాలం కొనసాగుతుందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు.

ఖైరతాబాద్ ఉపఎన్నికలో బలమైన అభ్యర్థిని నిలబెడతాం : కవిత

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఖైరతాబాద్ అసెంబ్లీ ఉపఎన్నికపై స్పందించారు. ఖైరతాబాద్ ఉప ఎన్నికలో తమ పార్టీ కచ్చితంగా పోటీ చేస్తుందని, బలమైన అభ్యర్థిని నిలబెడతామని ఆమె ప్రకటించారు. దసరా రోజున ఒక ఎమ్మెల్సీ అభ్యర్థిని కూడా ప్రకటిస్తామని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి పాలనను పక్కనపెట్టి రాజకీయాలపైనే దృష్టి సారిస్తున్నారని కవిత ఆరోపించారు. రాష్ట్రంలో రైతులు కరవుతో అల్లాడుతుంటే, ముఖ్యమంత్రి మాత్రం గోవా, ఢిల్లీ పర్యటనల్లో బిజీగా ఉన్నారని విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు రాబోయే ఏడె నిమిది నెలల పాటు ప్రజల్లోనే ఉండి క్షేత్రస్థాయిలో పోరాడతామని కవిత స్పష్టం చేశారు. నవంబర్ చివరి వరకు రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌ను నిరంతరాయంగా అందిం చాలని డిమాండ్ చేశారు. మేడిగడ్డ బ్యారేజీ పనులను వెంటనే పునరుద్ధరించి పూర్తి చేయాలని కోరారు. పారదర్శకత కోసం ఇకపై అన్ని ఎన్నికలను ఈవీఎంలకు బదులుగా బ్యాలెట్ పేపర్లతోనే నిర్వహించాలని ఆమె డిమాండ్ చేశారు. గ్లోబల్ సమ్మిట్‌పై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయకపోతే అడ్డుకుంటామని హెచ్చరించారు.

రేవంత్ సన్నిహితులకు మెడికవర్‌లో వాటాలు : మన్నె క్రిశాంక్

మొదటిపేజీ తరువాయి.. మెడికవర్ ఆసుపత్రి వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ బహిరంగ సవాల్ విసిరారు. ముఖ్యమంత్రి కుటుంబానికి అత్యంత సన్నిహితులైన వ్యక్తులకు మెడికవర్ ఆసుపత్రితో పాటు ఇతర అనుబంధ సంస్థల్లో వాటాలు ఉన్నాయని ఆరోపిస్తూ, అందుకు సంబంధించిన ఆధారాలు తన వద్ద ఉన్నాయంటూ సోషల్ మీడియాలో ఒక వీడియోను విడుదల చేశారు. మెడికవర్‌లో తన కుటుంబానికి వాటాలున్నాయని నిరూపించాలని రేవంత్ రెడ్డి డిమాండ్ చేసిన నేపథ్యంలో క్రిశాంక్ ఈ వీడియోతో స్పందించారు. సీఎంకు సన్నిహితులంటూ ఆయన ముగ్గురి పేర్లను వెల్లడించారు. డుంపా శిరీష రెడ్డి, బ్రహ్మానంద రెడ్డి, అన్నం శరత్ రెడ్డిలకు మెడికవర్ ఆసుపత్రి, మ్యాక్స్‌బిన్ ఫార్మా, మైండ్‌వాల్ట్ సంస్థల్లో ఉన్న షేర్ల వివ రాలను సంఖ్యలతో సహా వెల్లడించారు. ఈ సంబంధాలు స్పష్టంగా కనిపిస్తున్నా ముఖ్యమంత్రి ఎందుకు మౌనంగా ఉన్నారని ఆయన ప్రశ్నించారు. మెడికవర్ ఆసుపత్రిని రూ.13,200 కోట్లకు విక్రయించారని, ఈ లావాదేవీ ద్వారా నల్లధనాన్ని తెల్లధనంగా మార్చారని క్రిశాంక్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ వ్యవహారంపై తక్షణమే సీబీఐతో విచారణ జరిపించాలని, లేదంటే ఆ డబ్బును రాష్ట్రంలోని రైతులకు పంపిణీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో ఇదే అంశంపై ఆరోపణలు చేసినందుకు మన్నె క్రిశాంక్‌ను పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. తాజా వీడియోతో ఈ వివాదం మరోసారి రాజకీయంగా వేడెక్కింది.

పిల్లల సోషల్ మీడియా భద్రత.. కేంద్రానికి సుప్రీంకోర్టు నోటీసులు

మొదటిపేజీ తరువాయి.. సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల వల్ల పిల్లలు ఎదుర్కొంటున్న ప్రమాదాల నుంచి వారిని రక్షించేందుకు సమగ్రమైన, పటిష్ఠమైన నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు స్పందించింది. ఈ విషయంపై ఈరోజు కేంద్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్ మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు విచారణ చేపట్టింది. 'ది ఎమరాల్డ్ హైట్స్ ఇంటర్నేషనల్ స్కూల్', దాని డైరెక్టర్ సిద్ధార్థ్ సింగ్ గిర్నార్ ఈ పిటిషన్‌ను దాఖలు చేశారు. సోషల్ మీడియా వాడకానికి కనీస వయసు నిబంధనలు, ఆన్‌లైన్ వేధింపుల నుంచి రక్షణ కల్పించే మార్గదర్శకాలు రూపొందిం చాలని వారు తమ పిటిషన్‌లో కోరారు. కేంద్ర ప్రభుత్వం, మహిళా శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ, న్యాయ మంత్రిత్వ శాఖ, జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్‌ను ప్రతివాదులుగా చేర్చారు. ఇప్పటికే ఇలాంటి అంశంపై పెండింగ్‌లో ఉన్న మరో కేసుతో ఈ పిటిషన్‌ను ధర్మాసనం జతచేసింది. తదుపరి విచారణను డిసెంబర్ 3వ తేదీకి వాయిదా వేసింది. ప్రస్తుతం చాలా సోషల్ మీడియా సంస్థలు 13 ఏళ్ల కనీస వయసును స్వీయ-ధృవీకరణ పద్ధతిలో అమలు చేస్తున్నాయని, ఇది భారతీయ చట్టాల ప్రకారం పిల్లలకు లభించాల్సిన రక్షణకు సరిపోదని పిటిషనర్లు వాదించారు. 2023 నాటి డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ యాక్ట్ ప్రకారం 18 ఏళ్లలోపు ప్రతి ఒక్కరినీ 'పిల్లలు'గా పరిగణి స్తారని, వారికి అదనపు రక్షణ కల్పించాలని గుర్తుచేశారు. తల్లిదండ్రుల ధృవీకరణతో కూడిన అనుమతి, వారి ప్రవర్తనను ట్రాక్ చేయకుండా ఉండటం, లక్షిత ప్రకటనలపై పరి మితులు వంటివి ఇందులో ఉన్నాయని పేర్కొన్నారు. అయితే, ప్రస్తుతమున్న చట్టాలు అసంపూర్తిగా ఉన్నాయని, పిల్లల భద్రతకు సంబంధించి వయసు నిర్ధారణ, తల్లిదండ్రుల ప్రమేయం, సోషల్ మీడియా సంస్థల జవాబుదారీతనంపై స్పష్టమైన విధానం లేదని పిటిషన్‌లో ఆరోపించారు. సోషల్ మీడియా వల్ల పిల్లలు సైబర్‌బుల్లీయింగ్, వేధింపులు, హానికర కంటెంట్, అపరిచితుల నుంచి ప్రమాదకర పరిచయాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అధిక వినియోగం వల్ల నిద్రలేమి, ఏకాగ్రత తగ్గడం, ఆందోళన, ఆత్మన్యూనత, చదువుపై శ్రద్ధ తగ్గడం వంటి సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో పిల్లల ఖాతాలకు తప్పనిసరి ప్రైవసీ సెట్టింగ్‌లు, వయసుకు తగిన యాక్సెస్, హానికర కంటెంట్‌పై ఆంక్షలు విధించేలా మార్గదర్శకాలు జారీ చేయాలని పిటి షనర్లు సుప్రీంకోర్టును అభ్యర్థించారు.

ఇది కాంగ్రెస్ చేతగానితనం వల్ల వచ్చిన కరవు.. - కేటీఆర్


మొదటిపేజీ తరువాయి.. తెలంగాణలో ప్రస్తుతం నెలకొన్న నీటి ఎద్దడికి ప్రకృతి కారణం కాదని, కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో కనిపిస్తున్నది కాలం తెచ్చిన కరవు కాదని, కాంగ్రెస్ సర్కారు తెచ్చిన 'చేతకాని కరవు' అని విమ ర్శించారు. పంపులు ఆన్ చేయకుండా, రిజర్వా యర్లను నింపకుండా నీటిని వృథాగా దిగువకు వది లేశారని మండిపడ్డారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ ఏడాది జూన్ 1 నుంచి ఇప్పటి వరకు 750 టీఎంసీలకు పైగా గోదావరి నీటిని, 250 టీఎంసీల కృష్ణా జలాలను సముద్రంలోకి, దిగువ ప్రాంతాలకు వదిలేశారని కేటీఆర్ పేర్కొన్నారు. కన్నెపల్లి, దేవాదుల పంపులను సక్రమంగా నిర్వహించి వినియోగించుకుని ఉంటే గోదావరి పరివాహక ప్రాంతంలోని రిజర్వాయర్లు, చెరువులు నిండేవని అన్నారు. కానీ ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కృష్ణా జలాలను వినియోగించుకునేందుకు వీలున్న పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి ఎత్తిపోతల పథకాల పంపులను ఆన్ చేయకుండా నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. ప్రాజెక్టుల ద్వారా నీటిని ఎత్తిపోసి నిల్వ చేసుకునే అవకాశం ఉన్న ప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. ఎల్‌నినో ప్రభావం ఉండవచ్చని మార్చి నుంచే వాతా వరణ నిపుణులు హెచ్చరించినా కాంగ్రెస్ ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించలేదని కేటీఆర్ ఆరోపించారు. నీటి లభ్యతపై ముందుగానే అంచనాలు వేసి, సాగు, తాగునీటి అవసరాలకు అనుగుణంగా చర్యలు తీసుకోవాల్సిందని అన్నారు. మరోవైపు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పట్టిసీమ ద్వారా గోదావరి జలాలను తరలించుకెళ్లిందని కేటీఆర్ పేర్కొన్నారు. పోతిరెడ్డిపాడు, వెలిగొండ సొరంగం ద్వారా కృష్ణా జలాలను వినియోగించుకుందని, కుప్పం ప్రాంతానికి కూడా నీటిని అందించిందని అన్నారు. తెలంగాణకు దక్కాల్సిన నీటి వాటాను కాపాడుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫల మైందని విమర్శించారు. రాష్ట్రంలో నీటి ఎద్దడి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రాజెక్టుల నిర్వహణ, నీటి నిల్వలు, సాగు, తాగునీటి అవస రాలపై ప్రభుత్వం తక్షణమే దృష్టి పెట్టాలని కేటీఆర్ వ్యాఖ్యల సారాంశం. అయితే, నీటి విడుదలకు సంబంధించిన గణాంకాలు, ప్రభుత్వ నిర్లక్ష్యంపై చేసిన ఆరోపణలు కేటీఆర్ వెల్లడించినవే.

డిండి ప్రాజెక్టు రద్దు చేయకపోతే ఉద్యమమే : డీకే అరుణ హెచ్చరిక

మొదటిపేజీ తరువాయి.. డిండి ఎత్తిపోతల పథకాన్ని వెంటనే రద్దు చేయాలని బీజేపీ ఎంపీ డీకే అరుణ డిమాండ్ చేశారు. పాలమూరు రైతులకు కేటాయించిన నీటిని డిండికి తరలించి, స్థానిక రైతుల ప్రయోజ నాలకు నష్టం కలిగించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆమె తీవ్రంగా ఆరో పించారు. ఈ ప్రాజెక్టును రద్దు చేయని పక్షంలో జిల్లా వ్యాప్తంగా బీజేపీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని ఆమె హెచ్చరించారు. మహబూబ్‌నగర్‌లో పాలమూ రు - రంగారెడ్డి పెండింగ్ ప్రాజెక్టులపై బీజేపీ ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో డీకే అరుణ మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. జిల్లా ప్రజలకు మేలు చేయని సీఎం కుర్చీ రేవంత్ రెడ్డికి ఎందుకు? అని ఆమె ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. లమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు డిజైన్‌లో మార్పులు చేయ డం ద్వారా రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. గతంలో పదేళ్లు అధికారంలో ఉన్న కేసీఆర్... ఆర్డీఎస్ కోసం చేసిందేమీ లేదని డీకే అరుణ దుయ్యబట్టారు. రైతులు, అసంపూర్తిగా ఉన్న నీటిపారుదల ప్రాజెక్టుల విషయంలో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి కొరవడిందని ఆరోపించారు. పాలమూరు జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టుల న్నింటినీ తక్షణమే పూర్తి చేయాలని ఆమె డిమాండ్ చేశారు. పాలమూరు రైతుల నీటి హక్కులను కాపాడేందుకు బీజేపీ ఎల్లప్పుడూ పోరాడుతుందని స్పష్టం చేశారు.

ఈ నెలలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు..
- మహిళా రిజర్వేషన్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులపై కేంద్రం కసరత్తు..!

మొదటిపేజీ తరువాయి.. మహిళా రిజర్వేషన్లు, లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీల నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లులను ప్రవేశపెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ నెలలో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహించే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. లోక్‌సభలో ఈ బిల్లులను ఆమోదింపజేసేందుకు అవ సరమైన మద్దతు తమకు ఉందని కేంద్రం ధీమాగా ఉన్నట్లు సమాచారం. మరోవైపు ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్), ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ అంశాలపై ప్రతిపక్షాల నిరసనలు కొన సాగుతున్నాయి. ప్రతిపాదిత బిల్లులకు మద్దతు కూడగట్టేందుకు కేంద్రం ప్రతిపక్ష పార్టీలతోనూ చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ఈ ఏడాది ఏప్రిల్ 17న బడ్జెట్ సమావేశాల సందర్భంగా నియోజకవర్గాల పునర్వి భజన, మహిళా రిజర్వేషన్ల అమలుకు సంబంధించిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. దీంతో ఈసారి బిల్లులను ఆమోదింపజే సుకోవడం కేంద్రానికి కీలకంగా మారింది. రాజ్యాంగ సవరణ బిల్లుల ఆమోదానికి పార్లమెంట్‌లో ప్రత్యేక మెజారిటీ అవసరం. లోక్‌సభలో ప్రస్తుతం 540 మంది సభ్యులుండగా, మొత్తం సభ్యుల్లో మూడింట రెండొంతుల మద్దతు కీలకం. ఈ లెక్కన సుమారు 360 మంది సభ్యుల మద్దతు అవసరం. ఎన్డీయేకు లోక్‌సభలో మెజారిటీ ఉన్నప్పటికీ, రాజ్యాంగ సవరణకు అవసరమైన సంఖ్యాబలం విషయంలో సవాళ్లు ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వానికి మద్దతు పెరిగిందని, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన 20 మంది ఎంపీలు, శివసేన (యూబీటీ)కి చెందిన ఆరుగురు ఎంపీలు అధికార పక్షం వైపు మారారని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. అయితే బిల్లుల ఆమోదానికి అవసరమైన సంఖ్యాబలంపై తుది స్పష్టత ఓటింగ్ సమయంలోనే రానుంది. బిల్లులకు మద్దతు కూడగ ట్టేందుకు డీఎంకేతో కేంద్రం చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. తమి ళనాడు ఎన్నికల తర్వాత కాంగ్రెస్‌తో ఆ పార్టీ విభేదాలు రావడం, ఇండియా కూటమి నుంచి బయటకు రావడం నేపథ్యంలో ఈ సంప్రదిం పులకు ప్రాధాన్యం ఏర్పడింది. మరికొన్ని చిన్న ప్రతిపక్ష పార్టీలతోనూ



కేంద్రం మాట్లాడుతున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఆగస్టు 13న ముగిసిన పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ఇంకా అధికారికంగా ప్రొరోగేషన్ ప్రకటించలేదు. దీంతో ప్రత్యేక సమావేశాలు నిర్వహిం చేందుకు అవకాశం ఉందని సమాచారం. అక్టోబర్ 26, 27 తేదీల్లో సంవిధాన్ సదన్‌లో జరగనున్న 12వ బ్రిక్స్ పార్లమెంటరీ ఫోరమ్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక సమావేశాల తేదీలను ఖరారు చేయనున్నట్లు తెలుస్తోంది. సమావేశాలకు వారం రోజుల ముందుగా నోటీసు ఇచ్చే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

స్టార్‌లింక్‌తో పోటీకి సై.. మేం భయపడం
- మస్క్ వ్యాఖ్యలకు రిలయన్స్ కౌంటర్

మొదటిపేజీ తరువాయి.. ఉపగ్రహ ఆధారిత ఇంటర్నెట్ సేవల్లో స్టార్‌లింక్ సహా ఏ సంస్థతోనైనా పోటీకి సిద్ధంగా ఉన్నామని రిలయన్స్ ఇండస్ట్రీస్ స్పష్టం చేసింది. భారతీయ, విదేశీ సంస్థలన్నింటికీ దేశంలో ఒకే విధమైన నిబంధనలు వర్తిస్తాయని తెలిపింది. స్టార్‌లింక్ భారత్‌లో ప్రవేశించేందుకు ఎదుర వుతున్న నియంత్రణపరమైన అడ్డంకులపై ఎలాన్ మస్క్ విమర్శలు చేసిన నేపథ్యంలో రిలయన్స్ ఈ ప్రకటన చేసింది. భారత్‌లో పెట్టుబడులు, నూతన ఆవిష్కరణలను స్వాగతించే వాతావరణం ఉందని రిలయన్స్ పేర్కొంది. అయితే దేశ చట్టాలు, విధానాలకు లోబడి ప్రతి సంస్థ పనిచేయాల్సిందేనని స్పష్టం చేసింది. భారత ప్రభుత్వ విధానం ప్రకారం దేశీయ, విదేశీ సంస్థలకు ఒకే విధమైన ప్రక్రియ వర్తిస్తుందని తెలిపింది. జియో ఉపగ్రహ సేవలకు సైతం ఇంకా అనుమతులు రావాల్సి ఉందని వెల్లడించింది. పోటీకి తాము ఎప్పుడూ భయపడలేదని, వినియోగదారులకు మెరుగైన సేవలు ఎవరు అందిస్తున్నారో నిరూపించుకు నేందుకు పోటీనే సరైన పరీక్ష అని రిలయన్స్ పేర్కొంది. 2016లో టెలికాం రంగంలోకి అడు గుపెట్టినప్పుడు జియోకు ఒక్క వినియోగ దారుడు కూడా లేడని గుర్తుచేసింది. పదేళ్లలో 53 కోట్లకు పైగా వినియోగదారుల నమ్మకాన్ని సంపాదించామని, ప్రపంచంలోనే అత్యంత అందుబాటు ధరల్లో డేటా సేవలను, మెరుగైన డిజిటల్ మౌలిక సదుపాయాలను అంది స్తున్నామని తెలిపింది. భారత్‌లో ఉపగ్రహ కమ్యూనికేషన్ సేవలు అందించేందుకు స్టార్‌లింక్‌కు లైసెన్స్ లభించింది. అయితే వాణిజ్య సేవలు ప్రారంభించాలంటే భద్రతాప రమైన అనుమతులతోపాటు మరికొన్ని ఆమోదాలు పొందాల్సి ఉంది. స్టార్‌లింక్ భారత్‌లో ప్రవేశించే అంశంపై గత వారం ఎలాన్ మస్క్.. రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీని లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేశారు. అంబానీని వ్యంగ్యంగా 'ప్రధాని అంబానీ' అని సంబోధించారు. భారత మార్కెట్‌లో గుత్తాధిపత్యాన్ని కొనసాగించాలని అంబానీ కోరుకుంటున్నారని ఆరోపిస్తూ, స్టార్‌లింక్‌ను పోటీకి అనుమతిస్తారా? అని ప్రశ్నించారు. భారత్‌లో అసలైన అధికారం అంబానీ చేతుల్లో ఉందన్నట్లుగా ఇటీవల మస్క్ 'ఎక్స్' వేదికగా వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. తన ప్రభావాన్ని గుర్తించలేకపోయి నందుకు క్షమాపణలు చెబుతున్నానంటూ వ్యంగ్యంగా పోస్టు చేశారు. ఈ వ్యాఖ్యల నేపథ్యంలో రిలయన్స్ తన వైఖరిని స్పష్టం చేసింది.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

బతుకమ్మ, దసరా ఉత్సవాలకు పక్కా ఏర్పాట్లు చేయాలి

- ఉత్సవ పనులను శుక్రవారం సాయంత్రంలోగా పూర్తి చేయాలి

హనుమకొండ, అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలైన బతుకమ్మ, విజయదశమి ఉత్సవాలను పురస్కరించుకుని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) పరిధిలో పక్కా ఏర్పాట్లు చేయాలని కమిషనర్ వెంకన్న అధికారులను ఆదేశించారు. ఉత్సవాలకు సంబంధించిన అన్ని పనులను శుక్రవారం సాయంత్రంలోగా యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు.ఈ సందర్భంగా అధికారుల బృందంతో కలిసి హసన్‌పర్తి, భీమారం, వడ్డేపల్లి చెరువు, పద్మాక్షి గుండం, రంగలీల మైదానం తదితర ప్రాంతాల్లో కమిషనర్ క్షేత్రస్థాయిలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు.ఉత్సవ ప్రాంతాలు, ఘాట్లు, ఊరేగింపు మార్గాల్లో నిరంతరం చెత్తను తొలగిస్తూ పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని సూచించారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఉత్సవ ప్రాంగణాలు, ప్రధాన రహదారుల్లో తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. చెరువుల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని, భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు.బతుకమ్మ, దసరా ఉత్సవాలకు నగరంతో పాటు వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉందని కమిషనర్ పేర్కొన్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ఉత్సవాలు ప్రశాంతంగా, వైభవంగా జరిగేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు



రైతుల సమస్యలను పట్టించుకోని మంత్రి సీతక్క

- బీఆర్ఎస్ నేత రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి

ములుగు జిల్లా /తాడ్వాయి అక్టోబర్ 16(నిత్యం నిఘా ప్రతినిధి): రైతుల సమస్యలను పరిష్కరించడంలో మంత్రి సీతక్క నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రామసహాయం శ్రీనివాస్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం మేడారంలోని బీఆర్ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు దండుగుల మల్లయ్య నివాసంలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు.రాష్ట్రంలో వ్యవసాయంపైనే ఆధారపడిన రైతు కుటుంబాలు యూరియా కొరతతో ఇబ్బందులు ఎదుర్కొన్నాయని, ప్రస్తుతం విద్యుత్ సరఫరా సమస్యలతో సతమతమవుతున్నాయని ఆయన పేర్కొన్నారు. జిల్లాలో విద్యుత్ సరఫరా సక్రమంగా లేక వేలాది ఎకరాల్లో వరి, మొక్కజొన్న పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన మంత్రి సహకార సంఘాలకు నామినేషన్లు చేపట్టడంపై దృష్టి సారిస్తున్నారని విమర్శించారు.తాడ్వాయి పంచాయతీ పట్ల వివక్ష చూపుతున్నారా?గత పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరపున పోటీ చేసిన ఆదివాసీ యువతిని తాడ్వాయి ప్రజలు సర్పంచ్‌గా ఎన్నుకున్నారని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలో తాడ్వాయి గ్రామపంచాయతీ ఆధీనంలో ఉన్న ప్రభుత్వ ఫంక్షన్ హాల్‌ను పక్కనే ఉన్న కామారం గ్రామపంచాయతీకి అప్పగించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.మండల కేంద్రంలో నిర్వహించే ప్రభుత్వ కార్యక్రమాలకు తాడ్వాయి సర్పంచ్ కొట్టెం ప్రవళికను ఆహ్వానించకపోవడం, ఆమె భర్తను అరెస్టు చేయించడం అప్రజాస్వామిక చర్యలని ఆయన ఆరోపించారు. తాడ్వాయి ప్రజలు మంత్రి సీతక్కకు ఓటు వేయలేదా? ఆ గ్రామ ప్రజల సమస్యలు పట్టించుకోవాల్సిన అవసరం లేదా? అని ప్రశ్నించారు.జిల్లా ప్రజలు మంత్రి సీతక్క వైఖరిని ప్రశ్నించాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో మాజీ సర్పంచులు చిడం బాబురావు, గుర్రం సమ్మిరెడ్డి, సిద్ధబోయిన శివరాజ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పత్తి గోపాల్‌రెడ్డి, రఫీక్, సిద్ధబోయిన వసంతరావు, చిర్ర సంజీవరెడ్డి, మండల యువజన విభాగం అధ్యక్షుడు కోట సురేష్ తదితరులు పాల్గొన్నారు.



63 మంది లబ్ధిదారులకు రూ.63.07 లక్షల కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

పెద్దపల్లి జిల్లా, అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి) : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు అన్నారు. శుక్రవారం పెద్దపల్లి పట్టణంలోని ఆర్.కె. గార్డెన్స్‌లో పెద్దపల్లి పట్టణం, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 63 మంది లబ్ధిదారులకు రూ.63,07,308 విలువైన కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను స్థానిక నాయకులతో కలిసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రజలకు అనేక సంక్షేమ పథకాలను అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.10 లక్షలకు పెంపు, రూ.500కే గ్యాస్ సిలిండర్, నూతన రేషన్ కార్డుల జారీ, సన్నబియ్యం ఉచిత పంపిణీ వంటి పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి

ఎల్‌నినో ప్రభావంతో సాగునీటి కొరత ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రైతులు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని విజయరమణరావు సూచించారు. వరి సాగుకు బదులుగా ఇతర పంటలను సాగు చేయాలని, రైతులు పండించిన ప్రత్యామ్నాయ పంటలను ప్రభుత్వం తరపున కొనుగోలు చేసే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు.రైతులకు సాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నేతృత్వంలో భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి చర్చించినట్లు తెలిపారు. రైతులకు సాధ్యమైనంత మేరకు సాగునీటి ఇబ్బందులు తగ్గించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ చైర్మన్, తహసీల్దార్, సింగిల్ విండో చైర్మన్లు, డైరెక్టర్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పదేళ్ల నిరీక్షణకు తెర.. పేదలకు స్మార్ట్ రేషన్ కార్డులు

- లబ్ధిదారులకు పంపిణీ చేసిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

హనుమకొండ, అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి) : గత పదేళ్లుగా కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్న అర్హులైన పేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఊరటనిస్తోందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందించడంతోపాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని వికాస్ నగర్, హౌసింగ్ బోర్డు కాలనీలలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత పదేళ్లుగా కొత్త రేషన్ కార్డులు మంజూరు కాకపోవడంతో అనేక పేద కుటుంబాలు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమయ్యాయని పేర్కొన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అర్హులకు కొత్త రేషన్ కార్డులు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.రేషన్ కార్డు కేవలం నిత్యావసర సరుకులు పొందేందుకు మాత్రమే కాకుండా, అర్హులైన కుటుంబాలకు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందించడంలోనూ కీలక పాత్ర పోషిస్తుందని ఎమ్మెల్యే వివరించారు. కొత్త కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు పొందే అవకాశం కలుగుతుందని తెలిపారు.వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో సుమారు 16 వేల కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయని వెల్లడించారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, పేదల జీవన ప్రమాణాలను మెరుగు పరిచేందుకు కృషి చేస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు



నరకాసుర వధ ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం



హనుమకొండ, అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేలా దీపావళి పండుగ సందర్భంగా నవంబర్ 6న నిర్వహించనున్న నరకాసుర వధ ఉత్సవాలను అంగరంగ వైభవంగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేయిస్తానని వరంగల్ తూర్పు ఎమ్మెల్యే, మాజీ మంత్రి కొండా సురేఖ మురళీధర్‌రావు తెలిపారు. ఈ నెల 22న అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేయిస్తానని పేర్కొన్నారు.శుక్రవారం నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి ఆధ్వర్యంలో కమిటీ ప్రతినిధులు ఎమ్మెల్యే కొండా సురేఖను కలిసి శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం ఉత్సవాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఉత్సవ కమిటీ ప్రతినిధులతో సమావేశమై నరకాసుర వధ ఉత్సవాల నిర్వహణ విధానాన్ని తెలుసుకున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జీడబ్ల్యూఎంసీతో పాటు ఇతర శాఖల ద్వారా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా పోలీస్ కమిషనర్‌తో చర్చించి తగిన బందోబస్తు ఏర్పాటు చేయిస్తానని తెలిపారు.వినతిపత్రం అందజేసిన వారిలో నరకాసుర వధ ఉత్సవ కమిటీ ప్రతినిధులు కనుకుంట్ల రవి, మరుపల్ల గౌతమ్, ఆవునూరి రామ్మూర్తి, దూడే బాలకొమురెల్లి, వనం కుమార్, ఆవునూరి రామన్న, కోరె సాంబమూర్తి, కాటం సతీష్, ద్రౌపది సురేష్, మాటేటి శ్యామ్, ఆవునూరి ఐలేశం, మంద పవన్, పోలం రంజిత్, కుండే సదానందం, గౌడ కోటేశ్వర్, బలభద్ర శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మడికొండలో ఘనంగా దుర్గామాత కుంకుమ పూజ



హనుమకొండ, అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి): మడికొండ అంబేద్కర్ సెంటర్‌లో శ్రీ దుర్గా శక్తి అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజ నిర్వహించి, భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, కమిటీ సభ్యులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో మడికొండ ఎస్‌హెచ్ఓ పుల్యాల కిషన్, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘు, బైరి లింగమూర్తి, కమిటీ సభ్యులు పల్లపు మధు, జానపట్ల రామ్ లక్ష్మణ్, రాకేష్, హర్షత్, ఓర్సు రాజు, రొడ్డ దయాకర్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



వరంగల్ / పర్వతగిరి , అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి): వరంగల్ జిల్లా పర్వతగిరి పోలీస్ స్టేషన్ నూతన సబ్‌ఇన్స్పెక్టర్‌గా రాజ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. గతంలో మడికొండ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించిన ఆయన, పోలీస్ శాఖలో జరిగిన బదిలీల్లో భాగంగా పర్వతగిరికి బదిలీ అయ్యారు.ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ సిబ్బంది ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుళ్లు, హోంగార్డులు నూతన ఎస్సై రాజ్‌కుమారకు పుష్పగుచ్ఛం అందించి ఘనంగా స్వాగతం పలికారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

అండర్–22 క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతుల ప్రదానం



పెద్దపల్లి జిల్లా/ కమాన్‌పూర్, అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి):కమాన్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఐకేపీ మైదానంలో శుక్రవారం నిర్వహించిన అండర్–22 క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగింది. ఈ పోటీల్లో విజేతలకు గ్రామ సర్పంచ్ రంగు సత్య నారాయణ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. ఉపసర్పంచ్ మహమ్మద్ రఫిక్ సోహెల్ మొదటి బహుమతిని అందించడంతోపాటు క్రీడాకారులకు పతకాలు అందించేందుకు సహకరించారు.ఈ సందర్భంగా సర్పంచ్, ఉపసర్పంచ్ మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడలపై కూడా ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడమే కాకుండా క్రమశిక్షణ, పట్టుదల, జట్టుస్ఫూర్తి వంటి లక్షణాలను అలవర్చుతాయని పేర్కొన్నారు. యువ క్రీడాకారులు తమ ప్రతిభను వెలికితీసి ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. యువతను క్రీడల వైపు ప్రోత్సహించేందుకు ఇలాంటి టోర్నమెంట్లు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు మల్యాల మహేష్ గౌడ్, ఏడో వార్డు సభ్యుడు పంజా సాయిరాం, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు కుక్క రవీందర్, కాంగ్రెస్ నాయకుడు వెంగళి రాజయ్య గౌడ్‌తోపాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయ అభివృద్ధి, పరిరక్షణ ప్రతి ఉద్యోగి బాధ్యత



హనుమకొండ/ కే యూ, అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి): కాకతీయ విశ్వవిద్యాలయ అభివృద్ధి, పరిరక్షణలో ప్రతి ఉద్యోగి, నాయకుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం పిలుపునిచ్చారు. ఉద్యోగులు నిబద్ధతతో విధులు నిర్వర్తిస్తూ సమయపాలన పాటించాలని, సామాజిక స్పృహతో పనిచేస్తూ విశ్వవిద్యాలయ పురోగతికి కృషి చేయాలని సూచించారు.శుక్రవారం కాకతీయ విశ్వవిద్యాలయంలోని ప్రవేశాల విభాగం కార్యాలయంలో విశ్వవిద్యాలయ పరిరక్షణ, నాయకత్వ బాధ్యతలు, ఉద్యోగుల విధులు, కర్తవ్యాలపై కీలక సమావేశం నిర్వహించారు. కొత్తగూడెం ఇంజినీరింగ్ కళాశాల సహాయ ఆచార్యుడు డాక్టర్ శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి. రామచంద్రం ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయ అభివృద్ధి, పరిరక్షణ అనేది ఒక్కరి బాధ్యత కాదని, ప్రతి ఉద్యోగి తన హోదా, స్థానం, విధులకు అనుగుణంగా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. నాయకత్వ బాధ్యతలు నిర్వహించే వారు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తూ మార్గదర్శకులుగా వ్యవహరించాలని సూచించారు. సమయపాలన, విధి నిర్వహణలో నిబద్ధత, సామాజిక స్పృహకు ప్రాధాన్యమివ్వాలని తెలిపారు.విశ్వవిద్యాలయం అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే ఉద్యోగులందరి సమష్టి కృషి అవసరమని రిజిస్ట్రార్ స్పష్టం చేశారు. వ్యక్తిగత బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించడంతో పాటు విశ్వవిద్యాలయ ప్రయోజనాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని అన్నారు.సమావేశంలో నాయకత్వ బాధ్యతలు, ఉద్యోగుల విధులు, సమయ పాలన, పరస్పర సమన్వయం, సామాజిక స్పృహతో పాటు విశ్వవిద్యాలయ అభివృద్ధి, పరిరక్షణకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు తమ అభిప్రాయాలు, సూచనలు వెల్లడిస్తూ విశ్వవిద్యాలయ ప్రయోజనాల పరిరక్షణకు సమష్టి కృషి అవసరమని అభిప్రాయపడ్డారు.ఈ సమావేశం నిర్వహణలో కాకతీయ విశ్వవిద్యాలయ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ పుల్లా శ్రీనివాస్ చొరవ తీసుకున్నారు. వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వాజేడు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విక్రాంత్ వర్మకు సర్పంచుల ఘన సన్మానం



ములుగు జిల్లా / వాజేడు, అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి):వాజేడు మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన కాకర్లపూడి విక్రాంత్ వర్మను మండలంలోని కాంగ్రెస్ పార్టీ సర్పంచులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతలు చేపట్టిన ఆయన పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేయాలని ఈ సందర్భంగా సర్పంచులు ఆకాంక్షించారు.ఈ సందర్భంగా విక్రాంత్ వర్మ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండల అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యకర్తలు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి, అభ్యున్నతికి కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వాజేడు మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు, గుమ్మడిదొడ్డి సర్పంచ్ భరత్ కుమార్, కృష్ణాపురం సర్పంచ్ విజయబాబు, టేకులగూడెం సర్పంచ్ బాలకృష్ణ, ధర్మారం సర్పంచ్ కాక సుమతి, నాగారం సర్పంచ్ బోడబోయిన స్వరూప, చండ్రుపట్ల సర్పంచ్ అనుముల సంధ్యారాణి, నాగారం ఉపసర్పంచ్ మందపాటి సుబ్బరాజు, కొంగల సర్పంచ్ కళ్యాణి, దూలపురం సర్పంచ్ యాలం విజయలక్ష్మి, మురుమూరు సర్పంచ్ మడకం సుభద్ర, కాంగ్రెస్ పార్టీ నాయకులు పశువుల లక్ష్మణ్, ఎట్టి లక్ష్మయ్య, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీక బతుకమ్మ పండుగ



మహబూబాబాద్ జిల్లా/తొర్రూరు, అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి):తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి నిదర్శనమని తొర్రూరు తహసీల్దార్ గడీల శ్రీనివాస్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది సంయుక్తంగా బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులంతా సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు.బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో అంటూ మహిళలు ఆడిపాడడంతో కార్యాలయాల ప్రాంగణాలు పండుగ శోభను సంతరించుకున్నాయి. పూలనే దేవతగా కొలుస్తూ ప్రకృతిని ఆరాధించే బతుకమ్మ పండుగ తెలంగాణ ప్రత్యేకతను చాటుతుందని తహసీల్దార్, ఎంపీడీవో పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల జీవన విధానానికి, మహిళల ఆత్మగౌరవానికి, సామాజిక సంస్కృతికి అద్దం పట్టే ఈ పండుగ ప్రజల జీవితాల్లో అంతర్భాగంగా నిలిచిందని తెలిపారు. తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలను కాపాడుతూ, భావి తరాలకు వాటి గొప్పతనాన్ని తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి హరిప్, హుస్సేన్, గృహ నిర్మాణ శాఖ సహాయ ఇంజినీర్లు యామిని, బిందు, సర్పంచులు సంకేపల్లి స్వాతి, మాలోత్ మౌనిక, భానోత్ రజిని, విజయ లింబ, సావిత్రి, శ్రీనివాస్, బంగారు రమేష్, భానోత్ విద్యాసాగర్, అంగన్‌వాడీ పర్యవేక్షకులు గౌస్య, శ్రీదేవి, గ్రామ పంచాయతీ అధికారి ధరణి, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, కార్యాలయాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా ఉంటా

- **నిరుపేద కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయం అందించిన జక్కా మహబూబ్ రెడ్డి**



మహబూబాబాద్ జిల్లా/ తొర్రూరు, అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి):మండలంలోని ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటూ, ఆపదలో ఉన్నవారికి తనవంతు సహాయ సహకారాలు అందిస్తానని మడిపల్లి మాజీ ఎంపీటీసీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జక్కా మహబూబ్ రెడ్డి అన్నారు. నిరుపేద కుటుంబాలను ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని, ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.తొర్రూరు మండలం ఫతేపురం గ్రామానికి చెందిన డోర్నాల మురళి అనారోగ్యంతో మృతి చెందడంతో శనివారం జక్కా మహబూబ్ రెడ్డి, జక్కా ఇంద్రసేన రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మురళి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను ఓదార్చారు. నిరుపేద కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సాయాన్ని అందజేసి తమ వంతు చేయూతనిచ్చారు.అదేవిధంగా గ్రామ సర్పంచ్ ఇట్టే మాధవరెడ్డి 25 కిలోల బియ్యం, ఉపసర్పంచ్ కొండ సతీష్ మరో 25 కిలోల బియ్యాన్ని బాధిత కుటుంబానికి అందజేశారు. కష్టకాలంలో బాధిత కుటుంబానికి అండగా నిలిచిన సర్పంచ్, ఉపసర్పంచ్‌లను జక్కా మహబూబ్ రెడ్డి అభినందించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు తమకు తోచిన విధంగా నిరుపేదలను ఆదుకోవడం అభినందనీయమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు రామ్ సింగ్, పల్లె సాయిలు, వెన్నం సోమిరెడ్డి, జమ్ముల యాకయ్య, ఇట్టే మహేందర్ రెడ్డి, జూకంటి వెంకన్న, కుమ్మరి కుంట్ల వెంకన్న, యర్రం రాజు యాదవ్, బోధపెల్లి అన్వేష్, దేశబోయిన కొమురయ్య, గ్రామ కాంగ్రెస్ యువజన విభాగం అధ్యక్షుడు జంగం గణేష్, ఎర్రగొల్ల సుమంత్, గజ్జి సంబీప్, సూరిబాబు తదితరులతో పాటు గ్రామస్థులు, మహిళలు, యువకులు పాల్గొని మురళికి నివాళులర్పించారు.

అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు అందాలి



హనుమకొండ, అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి):పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యమని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. రాజకీయ స్వార్థ ప్రయోజనాల కోసం కాకుండా ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో పనిచేసే నాయకులనే ప్రజలు ఆదరించాలని పిలుపునిచ్చారు.శనివారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 210 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను, మరో 150 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల చెక్కులను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా పథకాల కింద మొత్తం రూ.1.55 కోట్ల విలువైన చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. సొంత ఇల్లు ప్రతి పేద కుటుంబం కల అని, ఆ కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులకు ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఆడ పిల్లల వివాహాలు తల్లిదండ్రులకు ఆర్థిక భారంగా మారకూడదనే ఉద్దేశంతో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు వివరించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో రాజకీయ వివక్షకు తావులేకుండా అర్హతనే ప్రామాణికంగా తీసుకొని లబ్ధిదారులను ఎంపిక చేస్తున్నామని స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతోపాటు పేదల సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు.ప్రజాప్రతినిధులుగా ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించడం తమ బాధ్యతని నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. రాజకీయాలు ఎన్నికలకే పరిమితం కావాలని, ప్రజాసేవే ప్రధాన లక్ష్యంగా ఉండాలని అన్నారు. ప్రజల సంక్షేమం కోసం నిజాయితీగా పనిచేసే నాయకులను గుర్తించి ప్రోత్సహించాలని ప్రజలకు సూచించారు.ఈ కార్యక్రమంలో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ గుండు సుధారాణి, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, అధికారులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ములుగులో నూతన బార్ అండ్ రెస్టారెంట్ కేటాయింపు ప్రక్రియ పూర్తి

- **లక్కీ డ్రాలో 376 దరఖాస్తుల నుంచి ఎంపికైన 349వ టోకెన్ నంబరు**
- **జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు**



ములుగు జిల్లా , అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి):ములుగు మున్సిపాలిటీ పరిధిలో నూతన బార్ అండ్ రెస్టారెంట్ కేటాయింపునకు సంబంధించిన లక్కీ డ్రా ప్రక్రియ పూర్తయిందని జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు తెలిపారు. శుక్రవారం ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ పర్యవేక్షణలో లక్కీ డ్రా నిర్వహించారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 41 బార్ల ఏర్పాటుకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయగా, అందులో ములుగు మున్సిపాలిటీ పరిధిలో ఒక బార్ కేటాయింపునకు అవకాశం కల్పించింది. ఈ మేరకు సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 12 వరకు దరఖాస్తులు స్వీకరించగా, మొత్తం 376 దరఖాస్తులు అందినట్లు అధికారులు వెల్లడించారు.ఈ దరఖాస్తులకు సంబంధించి నిర్వహించిన లక్కీ డ్రాలో 349 టోకెన్ నంబరు గల దరఖాస్తుదారుడు బార్ అండ్ రెస్టారెంట్ కేటాయింపునకు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ సూచన

భూపాలపల్లి, అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి): ప్రస్తుత డిజిటల్ యుగంలో పెరుగుతున్న సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ సూచించారు. ఇంటర్నెట్, సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా వినియోగిస్తూ వ్యక్తిగత సమాచార భద్రతకు ప్రాధాన్యమివ్వాలని పిలుపునిచ్చారు.భూపాలపల్లి జిల్లా సింగరేణి సమాజ భవనంలో విద్యార్థులకు సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన కల్పించేందుకు పోలీసుల ఆధ్వర్యంలో 'సైబర్ నేరాలకు అడ్డుకట్ట' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు సైబర్ భద్రత, మోసాల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే అనుమానాస్పద లింకులను తెరవవద్దని, బ్యాంకు ఖాతా వివరాలు, ఒకసారి వినియోగించే రహస్య సంకేతాలు (ఓటీపీ), సంకేత పదాలు, వ్యక్తిగత చిత్రాలను ఇతరులతో పంచుకోవద్దని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో పరిచయమైన వ్యక్తులను గుడ్డిగా నమ్మకూడదని, అధిక లాభాలు వస్తాయంటూ సైబర్ నేరగాళ్లు చేసే మోసపూరిత వాగ్దానాలకు ఆకర్షితులు కావద్దని హెచ్చరించారు.విద్యార్థులు సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా భద్రతా నియమాలను వివరించాలని ఎస్పీ సూచించారు. అప్రమత్తత, సరైన అవగాహనతోనే ఆన్‌లైన్ మోసాల బారిన పడకుండా రక్షణ పొందవచ్చని పేర్కొన్నారు.ఎవరైనా సైబర్ ఆర్థిక మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే 1930 హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, భూపాలపల్లి పట్టణ పోలీస్‌స్టేషన్ సీఐ శ్రీనివాస్, సైబర్ నేరాల విభాగం ఎస్సై శ్రీనివాస్, ఆర్ఎస్ఐ శివకుమార్, విద్యార్థులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



పూల పండుగొచ్చె.. ములుగు కలెక్టరేట్ మురిసె

- **రంగురంగుల బతుకమ్మలతో పూలవనంగా మారిన కార్యాలయ ప్రాంగణం**
- **మహిళలు యాచించే స్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదగాలి: మంత్రి సీతక్క**

ములుగు జిల్లా , అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను ప్రతి ఒక్కరూ ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. మహిళలు యాచించే స్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.శుక్రవారం ములుగు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ ప్రాంగణంలో జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అధ్యక్షతన నిర్వహించిన బతుకమ్మ సంబరాలకు మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సంప్రదాయబద్ధంగా గౌరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి వేడుకలను ప్రారంభించారు. అనంతరం మహిళా అధికారులు, ఉద్యోగులతో కలిసి బతుకమ్మ ఆడి సందడి చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాల నుంచి ఆవిర్భవించిన విశిష్టమైన పండుగ బతుకమ్మ అని పేర్కొన్నారు. పూలను పేర్చి పూజించడం ద్వారా ప్రకృతిని ఆరాధించే ఈ పండుగకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందన్నారు. పూర్వీకుల నుంచి వారసత్వంగా అందిన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని సూచించారు. పసుపుతో గౌరమ్మను రూపొందించి పూజించడం వంటి ఆచారాల్లో సంప్రదాయంతో పాటు శాస్త్రీయ దృక్పథం కూడా ఇమిడి ఉందని తెలిపారు.బతుకమ్మ పాటలు పాడుతూ, చప్పట్లు కొడుతూ సంప్రదాయబద్ధంగా ఆడిపాడాలని, అందరూ కలిసి వేడుకల్లో పాల్గొనడం ద్వారా పరస్పర ఆత్మీయత, ఐక్యత పెరుగుతాయని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ఆర్థికంగా, సామాజికంగా ఉన్నత స్థాయికి ఎదగాలన్నదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆకాంక్ష అని తెలిపారు. మహిళల సంక్షేమం, అభ్యున్నతి కోసం రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు.ప్రభుత్వ ఉద్యోగులు కుటుంబాలతో సంతోషంగా ఉంటూనే విధి నిర్వహణలో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మంత్రి సీతక్క సూచించారు. అంకితభావంతో పనిచేసి ప్రజల ముఖాల్లో సంతోషం నింపాలని పిలుపునిచ్చారు. ప్రజలకు సేవ చేయడం ద్వారా కలిగే సంతృప్తి ఎంతో గొప్పదని పేర్కొంటూ సద్దుల బతుకమ్మ, దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు.జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటిచెబుతూ ప్రజల్లో ఆనందం, ఐక్యతను పెంపొందిస్తుందని అన్నారు. తాను మహారాష్ట్రకు చెందినప్పటికీ తెలంగాణకు వచ్చిన తర్వాత ఇక్కడి బతుకమ్మ, దసరా వేడుకల విశిష్టతను తెలుసుకున్నానని తెలిపారు. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి మహిళలంతా కలిసి పాటలు పాడుతూ ఆడిపాడటం ఎంతో ఆకట్టుకుంటుందని పేర్కొన్నారు. మహిళా అధికారులు, ఉద్యోగులు ఉత్సాహంగా సంబరాల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు మరింత అంకితభావంతో సేవలందించాలని ఉద్యోగులకు పిలుపునిచ్చారు.రంగురంగుల పూలతో పేర్చిన బతుకమ్మలతో కలెక్టరేట్ ప్రాంగణం పూలవనాన్ని తలపించింది. మహిళా ఉద్యోగులు సంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మ పాటలకు లయబద్ధంగా అడుగులు వేస్తూ ఉత్సాహంగా సంబరాలు జరుపుకున్నారు. మంత్రి సీతక్క వారితో కలిసి బతుకమ్మ ఆడటంతో వేడుకల్లో మరింత సందడి నెలకొంది.



రేవంత్



కలెక్టరేట్

32 మంది లబ్ధిదారులకు రూ.32.03 లక్షల చెక్కుల పంపిణీ

బతుకమ్మ సంబరాల అనంతరం మంత్రి సీతక్క కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ములుగు మండలానికి చెందిన 25 మంది, మల్లంపల్లి మండలానికి చెందిన ఏడుగురు కలిపి మొత్తం 32 మంది లబ్ధిదారులకు రూ.32,03,712 విలువైన చెక్కులను అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు సీహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, ములుగు మున్సిపల్ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఆసియా షాహిన్, రాష్ట్ర పంచాయతీరాజ్ సంచాలకుడు భగవాన్ రెడ్డి, కౌన్సిలర్లు, జిల్లా అధికారులు, మహిళా అధికారులు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

కరీంనగర్ జిల్లా / జమ్మికుంట, అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి):తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలను జమ్మికుంట మున్సిపల్ కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ పాల్గొని, పూలతో అందంగా అలంకరించిన బతుకమ్మల మధ్య పండుగ సందడిలో భాగస్వాములయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బతుకమ్మ పండుగకు తెలంగాణ సంస్కృతిలో విశిష్టమైన స్థానం ఉందని పేర్కొన్నారు. ప్రకృతిని ఆరాధిస్తూ పూలను పూజించే ఈ పండుగ మహిళల ఐక్యతకు, కుటుంబాల ఆనందానికి, తెలంగాణ సంప్రదాయాల పరిరక్షణకు ప్రతీకగా నిలుస్తుందని తెలిపారు. తరతరాలుగా వస్తున్న ఇటువంటి పండుగలను అందరూ కలిసికట్టుగా జరుపుకోవడం ద్వారా మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించవచ్చని అన్నారు.మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో నిర్వహించిన వేడుకలు ఆహ్లాదకరమైన వాతావరణంలో కొనసాగాయి. అధికారులు, కార్యాలయ సిబ్బంది కలిసి పాల్గొనడంతో ప్రాంగణమంతా పండుగ శోభను సంతరించుకుంది.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జున స్వామి, సహాయ ఇంజినీర్ వికాస్, పారిశుద్ధ్య పరిశీలకుడు ఇల్లందుల రమేష్, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది, పట్టణ స్థాయి సమాఖ్య వనరుల వ్యక్తులు (సీఎల్ఆర్‌పీలు), వనరుల వ్యక్తులు (ఆర్‌పీలు) తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ కోతలతో ఎండుతున్న పంటలు



ములుగు జిల్లా/ మల్లంపల్లి, అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి): వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా అందించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని, విద్యుత్ కోతల కారణంగా పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని బీఆర్ఎస్ మల్లంపల్లి మండల అధ్యక్షుడు పాలెపు శ్రీనివాస్ ఆరోపించారు. రైతులు రాత్రివేళల్లో సైతం విద్యుత్ కోసం పొలాల వద్ద వేచి చూడాల్సి రావడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమని విమర్శించారు.ములుగు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌బాబు ఆదేశాల మేరకు శుక్రవారం మల్లంపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాలెపు శ్రీనివాస్ మాట్లాడారు. వ్యవసాయ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పంటలను కాపాడుకునేందుకు అవసరమైన విద్యుత్ అందక నష్టపోయే పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భద్రాద్రి, యాదాద్రి విద్యుత్ ప్రాజెక్టుల ద్వారా విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ముందస్తు ప్రణాళికలు రూపొందించకపోవడం వల్లే విద్యుత్ కోతలు ఎదురవుతున్నాయని ఆరోపించారు. విద్యుత్ సరఫరాలో వైఫల్యాలకు క్షేత్రస్థాయి అధికారులను బాధ్యులను చేయడం కాకుండా, విద్యుదుత్పత్తి నుంచి పంపిణీ వరకు ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని కోరారు.తెలంగాణ విద్యుత్ రంగానికి కీలకమైన సింగరేణి సంస్థకు సంబంధించి టెండర్లు, బొగ్గు నిల్వలు, ప్రైవేటీకరణ ప్రచారాలపై వస్తున్న ఆరోపణలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ అంశాలపై సమగ్ర విచారణ జరిపించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు.వ్యవసాయానికి నిరంతరాయంగా ఉచిత విద్యుత్ సరఫరా చేయాలని, విద్యుత్ కోతల కారణంగా నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం చెల్లించాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. కాలిపోయిన విద్యుత్ మోటార్లు, పాడైన ట్రాన్స్‌ఫార్మర్లకు వెంటనే మరమ్మతులు చేపట్టి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. సింగరేణి ప్రైవేటీకరణ అంశంపై ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేయాలని అన్నారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చిదర సంతోష్, మాజీ ఎంపీటీసీ మాచర్ల ప్రభాకర్, నాయకులు గోల్కొండ రాజు, మెరుగు రాజు, కుసుమ ఆదినారాయణ, మంతుర్తి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి సహకార సంఘం చైర్మన్‌గా బొల్లు దేవేందర్ ముదిరాజ్ బాధ్యతల స్వీకరణ

- **రైతుల సంక్షేమానికి కృషి చేయాలి: మంత్రి సీతక్క**





ములుగు జిల్లా / తాడ్వాయి, అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి):
తాడ్వాయి మండల సహకార సంఘం నూతన చైర్మన్‌గా బొల్లు దేవేందర్ ముదిరాజ్ బాధ్యతలు స్వీకరించారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంకిడి నరసింహస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై నూతన చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ సహకార సంఘం ద్వారా రైతులకు మెరుగైన సేవలు అందించాలని, వారి సంక్షేమం కోసం కృషి చేయాలని ఆకాంక్షించారు. రైతుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.నూతన చైర్మన్ బొల్లు దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి చైర్మన్ బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. సహకార సంఘం అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రైతులకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పైడాకుల అశోక్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మద్దాల నాగమణి, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి రాజేందర్, ఆత్మ కమిటీ చైర్మన్ చిటమట రఘు, మాజీ సహకార సంఘం చైర్మన్ పులి సంపత్ గౌడ్, మేడారం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్ అరేం లచ్చు పటేల్, మాజీ ఎంపీటీసీ ముండ్రాతి రాజశ్రీ, లింగాల సర్పంచ్ మొగిలపెల్లి రవీందర్, జిల్లా, మండల నాయకులు, కాంగ్రెస్ కార్యకర్తలు, రైతులు, అభిమానులు తదితరులు పాల్గొని నూతన చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

భద్రాచలంలో వైభవంగా శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



భద్రాచలం, అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి):భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం లోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవ స్థానంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో కొలువై ఉన్న శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారు రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఉత్సవాల్లో నాలుగో రోజైన శుక్రవారం అమ్మవారు ధాన్యలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమి చ్చారు.ఈ నెల 20వ తేదీ వరకు అమ్మవారు ప్రతిరోజూ ఒక్కో అలంకరణలో భక్తులకు దర్శన మివ్వనున్నారు. దసరా మహోత్సవం సందర్భంగా ఈ నెల 20న దసరా మండపంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శమీ పూజ, ఆయుధ పూజతోపాటు శ్రీరామలీల మహోత్సవ వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి అలంకరణల దర్శనంతోపాటు ఆలయంలో శ్రీరామాయణ పారాయణ కార్యక్రమం కూడా కొనసాగుతోంది. సుమారు వందమంది భక్తులతోపాటు ఆలయ వేద పండితులు ప్రతిరోజూ ఈ పారాయణంలో పాల్గొంటూ భక్తిభావాన్ని చాటుతున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాలతో భద్రాచల ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

సరస్వతీ మాత రూపంలో దర్శనమిచ్చిన దుర్గమ్మ





పెద్దపల్లి జిల్లా / మంథని, అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి): మంథని పట్టణంలో రెబల్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గమ్మను సరస్వతీ మాత రూపంలో అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.అనంతరం అంత ర్జాతీయ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మేడగోని వెంకటేష్ గౌడ్, భవాని బేకరీ స్వీట్స్ హౌస్‌కు చెందిన భీముని విక్కీ గౌడ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ కార్యక్ర మానికి సహకరించిన దాతలకు, సేవలందించిన స్వచ్ఛంద సేవకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అమ్మవారి కృపతో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని, ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు.“అమ్మవారి దయ ఉంటే అన్నీ ఉన్నట్లే. అందరూ బాగుండాలి.. అందరికీ మంచి జరగాలి. మానవసేవే మాధవసేవ.. ఇదే సనాతన ధర్మ పరమార్థం” అని నిర్వాహకులు పేర్కొన్నారు.

సరస్వతీ దేవి అవతారంలో కొలువుదీరిన దుర్గామాత





వరంగల్/ వర్ధన్నపేట, అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి):వరంగల్ జిల్లా వర్ధన్న పేట మండలం కొత్తపల్లి గ్రామంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతు న్నాయి. ఉత్సవాల్లో భాగంగా సరస్వతీ దేవి అవతారంలో కొలువుదీరిన దుర్గామాత భక్తులకు దర్శనమిచ్చారు. జ్ఞాన ప్రదాయిని సరస్వతీ దేవి రూపంలో అమ్మవారు దర్శనమి వ్వడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించు కుంది.దుర్గామాత ఉత్సవ కమిటీ, దేవస్థాన చైర్మన్ కమ్మగోని సుధాకర్ గౌడ్ ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వ హిస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారికి హారతి సమర్పించారు. సరస్వతీ దేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ఆధ్యాత్మిక ఆనందంలో మునిగిపోయారు. మహిళల సందడి, భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది.దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తి, శక్తి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా కొనసాగుతున్నాయని గ్రామస్థులు పేర్కొన్నారు. కమ్మగోని సుధాకర్ గౌడ్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తుండటంపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అమ్మవారి కృపాకటాక్షాలు గ్రామ ప్రజలందరిపై ఉండాలని భక్తులు ప్రార్థించారు.

భవానీ మాతగా భక్తులకు దర్శనమిచ్చిన భద్రకాళి అమ్మవారు

- **ఆరో రోజు వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు.. గంధోత్సవం, శాలభంజిక సేవ నిర్వహణ**




వరంగల్ / భద్రకాళి ఆలయం , అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి):వరంగల్ నగరంలోని చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళి దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఆరో రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం అమ్మవారు భవానీ మాతగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు, గంధోత్సవం, శాలభంజిక సేవతో ఆలయంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. శుక్రవారం కావడంతో ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.ఉదయం నాలుగు గంటలకు నిత్యాహ్నికం నిర్వహించిన అనంతరం అర్చకులు అమ్మవారిని భవానీ మాతగా అలంకరించేందుకు ప్రార్థనలు జరిపారు. అనంతరం అమ్మవారిని భవానీ మాతగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వ హించారు. భవానీ రూపంలో అమ్మవారు భక్తులకు సమస్త భోగాలను ప్రసాదిస్తారని శాస్త్రాలు పేర్కొంటున్న నేపథ్యంలో ఈ అలంక రణకు విశిష్టత ఉందని ఆలయ అర్చకులు వివ రించారు. ఈ రోజు కాత్యాయని క్రమంలో, బోధాయన మహర్షి ప్రోక్త నవరాత్రి కల్పాన్ని అనుసరించి ధూమ్రహ క్రమంలో పూజారాధ నలు నిర్వహించారు.

గంధోత్సవంతో భూ సంబంధిత శుభాలు కలుగుతాయనే విశ్వాసం

అమ్మవారికి ప్రత్యేకంగా గంధోత్సవం నిర్వహిం చారు. భూమికి గంధం ప్రతీకగా భావించే సంప్రదాయం ప్రకారం ఈ ఉత్సవాన్ని నిర్వహి స్తారని ఆలయ అర్చకులు తెలిపారు. అమ్మవా రిని గంధోత్సవంలో దర్శించుకోవడం వల్ల భక్తులకు భూములు, వ్యవసాయ భూములు, గృహాలు తదితర ఆస్తులు సమకూరడంతో పాటు భూ సంబంధిత సమస్యలు తొలగుతా యని భక్తుల విశ్వాసమని పేర్కొన్నారు.సా యంత్రం శాలభంజిక సేవను వైభవంగా నిర్వ హించారు. అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకిగా అమ్మవారు పద్దెనిమిది మెట్లను అధిరోహించి సమస్త బ్రహ్మాండాన్ని జయించిన దివ్య స్వరూపంగా దర్శనమిచ్చారని ఆలయ ప్రధానార్చకులు శ్రీ భద్రకాళి శేషు వివరిం చారు. ఈ సేవలో అమ్మవారిని దర్శించుకో వడం వల్ల సకల ఐశ్వర్యాలు, ఆరోగ్యం, రాజకా ర్యాల్లో విజయాలు కలుగుతాయని భక్తుల నమ్మకమని తెలిపారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

శుక్రవారం ఉత్సవాలకు ఉభయదాతలుగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ మాజీ శాసన సభ్యుడు దాస్యం వినయభాస్కర్–రేవతి దంపతులు, కసిరెడ్డి సోమిరెడ్డి–కళావతి దంపతులు, మహేశ్వర్‌రెడ్డి–గీత దంపతులు, వేముల రోజ, దంతాల అనీష్య వ్యవహరిం చారు.వరంగల్ మహానగర పాలక సంస్థ కమి షనర్ కె. వెంకన్న కుటుంబ సమేతంగా, దేవాదాయ ధర్మాదాయ శాఖ కార్యనిర్వహణా ధికారి దుర్గాప్రసాద్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. పూజల అనంతరం వారికి మహదాశీర్వచనం అందించి అమ్మవారి ప్రసా దాలను పంపిణీ చేశారు.భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేసి, ప్రసాద వితరణను చేపట్టారు. ఆలయ చైర్మన్ డాక్టర్ శివసుబ్రహ్మణ్యం, ధర్మ కర్తలు కమటం వేణుగోపాల్, గాధే శ్రవణ్‌క ుమారరెడ్డి, రమేష్‌చంద్ భంగ్, మాడిశెట్టి సతీష్, కారంగుల సురేష్‌బాబు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



శుక్రవారం భద్రకాళి ఆలయంలో రథోత్సవం

భద్రకాళి దేవస్థానంలో నూతనంగా తయారు చేయించిన రథాన్ని శనివారం వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్‌రెడ్డి, నీలిమ దంపతులు దేవస్థానా నికి అందజేయనున్నారు. అనంతరం సాయంత్రం సంప్రదాయం ప్రకారం రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధి కారి రామల సునీత తెలిపారు.

అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌తో వరంగల్ నగర సమగ్రాభివృద్ధికి చర్యలు

- **మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం.. అభివృద్ధి పనుల ప్రతిపాదనలు, సమగ్ర ప్రాజెక్టు నివేదికలపై సమీక్ష : జిల్లా కలెక్టర ్ చాహత్ బాజ్‌పాయ్**



హన్మకొండ, అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి):అర్బన్ ఛాలెంజ్ ఫండ్ ద్వారా గ్రేటర్ వరంగల్ నగరాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు వివిధ ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు హన్మకొండ జిల్లా కలెక్టర్, గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ ప్రత్యేకాధి కారి చాహత్ బాజ్‌పాయ్ తెలిపారు. నగర భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంపై దృష్టి సారిస్తున్నట్లు వెల్లడించారు.రాష్ట్ర పురపాలక పరిపాలన శాఖ కార్యదర్శి, పురపాలక పరిపా లన సంచాలకురాలు డాక్టర్ టి.కె. శ్రీదేవి శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని పురపాలక సంఘాల కమిషనర్లతో నిర్వహిం చిన దృశ్య మాధ్యమ సమావేశంలో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద చేపట్టనున్న అభివృద్ధి పనులపై సమీక్షించారు.ఈ సమావేశంలో హన్మకొండ జిల్లా కలెక్టరేట్ నుంచి పాల్గొన్న కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, గ్రేటర్ వరంగల్ మహానగర పాలక సంస్థ కమిషనర్ టి. వెంకన్న నగరంలో ప్రతిపాదించిన అభివృద్ధి పనులు, వాటికి సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేది కల వివరాలను వివరించారు.నగరంలో ఆర్థిక కార్యకలాపాల విస్తరణ, రవాణా ఆధారిత పట్టణాభివృద్ధి, ప్రాంతీయ ప్రణాళిక, పట్టణ పునరుద్ధరణ, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, నగర ప్రాంతాల పునరాభివృద్ధి వంటి కీలక అంశాలకు సంబంధించిన ప్రతిపాదనలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఆయా రంగాల్లో అవసరమైన మౌలిక సదుపాయా లను మెరుగుపరచడం ద్వారా నగర అభివృద్ధికి మరింత ఊతమివ్వనున్నట్లు వివరించారు.నగర జనాభా, భవిష్యత్తు అవస రాలను దృష్టిలో ఉంచుకుని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు చర్యలు తీసు కుంటున్నట్లు అధికారులు తెలిపారు.ఈ సమా వేశంలో ముఖ్య ప్రణాళిక అధికారి అజిత్‌రెడ్డి, పర్యవేక్షక ఇంజినీర్ రాజ్‌కుమార్, కార్యనిర్వా హక ఇంజినీర్లు మహేందర్, రవికుమార్, సంజయ్‌కుమార్, భీమ్‌రావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

కాలం తెచ్చిన కరువు కాదు.. కాంగ్రెస్ తెచ్చిన కరువు!

- **రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి: బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నవీన్**



ములుగు జిల్లా , అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి):రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితు లకు కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలే కారణమని బీఆర్ఎస్ పాలకుర్తి మండల అధ్యక్షుడు నవీన్ విమర్శించారు. రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం ప్రచారానికే పరిమితమవుతోందని, ఫొటోలకు ఫోజులివ్వడం, ప్రచార కార్యక్ర మాలు నిర్వహించడం మినహా క్షేత్రస్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. శుక్రవారం పాలకుర్తిలో నిర్వహించిన విలేక రుల సమావేశంలో ఆయన మాట్లాడారు.కాం గ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు మూడేళ్లు కావస్తున్నా ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ఆశించిన పురోగతి కనిపించడం లేదని నవీన్ విమర్శించారు. కరువు పరిస్థితు లతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్న సమయంలో వారికి భరోసా కల్పించా ల్సింది పోయి పంటలు వేయవద్దని చెప్పడం బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు.వాతావ రణ శాఖ శాస్త్రవేత్తలు ఎల్‌నినో ప్రభావంపై హెచ్చరికలు చేసినప్పటికీ ప్రభుత్వం ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమైందని ఆయన ఆరోపించారు. సాగు చేసిన పంటలకు సైతం సక్రమంగా విద్యుత్ సరఫరా కాకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సరఫరాపై అధికారులను ప్రశ్నిస్తే తమ చేతుల్లో ఏమీ లేదన్న సమాధా నాలు వస్తున్నాయని, దీంతో రైతులు మరింత ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు.గతంలో దసరా పండుగ సమయా నికి పంటలు సమృద్ధిగా పండి రైతుల చేతికి డబ్బులు అందేవని, కుటుంబాలతో ఆనందంగా పండుగ జరుపుకునేవారని నవీన్ అన్నారు. ప్రస్తుతం పాలకుర్తి ప్రాంతంలో నెలకొన్న పరిస్థితులు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయని, నియోజకవర్గాన్ని ఎడారిగా మార్చే పరిస్థితులు కనిపిస్తున్నాయని విమర్శించారు.ప్రభుత్వం తక్షణమే రైతుల సమ స్యలను గుర్తించి సహాయక చర్యలు చేప ట్టాలని, వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా అందించాలని నవీన్ డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి, రైతులకు అండగా నిలవాలని కోరారు. ప్రభుత్వ పనితీరును ప్రచారంలో కాకుండా ఆచరణలో చూపించాలని అన్నారు.ఈ సమా వేశంలో పాలకుర్తి సర్పంచ్ కమ్మగాని విజయ నాగన్న, బీఆర్ఎస్ నాయకులు నాగిరెడ్డి, అశోక్‌రెడ్డి, సోమేశ్వరరావు, ఎల్లయ్య, కరుణా కర్‌రెడ్డి, మురళి, పాలకుర్తి ఉపసర్పంచ్ కిరణ్, వార్డు సభ్యులు అనూష, మధు, సుధాకర్, స్వప్న, సతీష్, కొండాపురం సర్పంచ్ గడ్డం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

బతుకమ్మ కోలాటాలతో వర్ధన్నపేటలో పండుగ సందడి

వరంగల్ జిల్లా / వర్ధన్నపేట, అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేళ వర్ధన్నపేటలో పండుగ సందడి నెలకొంది. బతుకమ్మ పాటలు, మహిళల కోలాటాలతో ప్రభుత్వ కార్యాలయాలు కళకళలాడాయి. వర్ధన్నపేట మున్సిపల్ కార్యాలయం, మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకలు ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి.

మహిళలతో కలిసి కోలాటం ఆడిన చైర్మన్

వర్ధన్నపేట మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో మున్సిపల్ చైర్మన్ పాలకుర్తి సారంగపాణి అధికారులతో, మహిళలతో కలిసి కోలాటం ఆడి సందడి చేశారు. మహిళలతో మమేకమై పండుగ సంబరాల్లో పాల్గొనడంతో వేడుకల్లో ఉత్సాహం మరింత పెరిగింది. బతుకమ్మ పాటలు, కోలాటాలతో కార్యాలయ ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది.ఎంపీడీవో కార్యాలయంలోనూ ఉత్సాహంగా వేడుకలువర్ధన్నపేట మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయంలోనూ బతుకమ్మ వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, మండల పరిషత్ కార్యాలయ పర్యవేక్షణ అధికారి జుమ్మిలాల్, సర్పంచుల ఫోరం అధ్యక్షురాలు కుల్ల పావని ఏకాంతం, వివిధ గ్రామాల సర్పంచులు, మహిళా సంఘాల సభ్యులు, అధికారులు పాల్గొన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై బతుకమ్మలను పేర్చి, పాటలు





పాడుతూ కోలాటాలతో వేడుకలను ఉత్సాహంగా జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల వైభవాన్ని చాటుతూ వర్ధన్నపేటలో బతుకమ్మ సంబరాలు కన్నుల పండువగా సాగాయి.

వాజేడు ఏజెన్సీలో 1/70 చట్టం అమలు ఏదీ

ములుగు జిల్లా / వాజేడు, అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి):వాజేడు ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టం, పంచాయతీల విస్తరణకు సంబంధించిన పీసా చట్టం అమలులో ఉన్నప్పటికీ, నిబంధనలకు విరుద్ధంగా గిరిజనేతరులు బహుళ అంతస్తుల భవనాలు నిర్మిస్తున్నారని ఆదివాసీ నవనిర్మాణ సేన (ఏఎన్ఎస్) ములుగు జిల్లా అధ్యక్షుడు ఎట్టి విద్యాసాగర్ ఆరోపించారు. ఈ నిర్మాణాలపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు.వాజేడు మండల కేంద్రంలో ఏఎన్ఎస్ సామాజిక మాధ్యమాల ప్రతినిధి పాయం అజయ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎట్టి విద్యాసాగర్ మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలో చట్టాలను ఉల్లంఘిస్తూ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నా, వలసలు పెరుగుతున్నా అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని అన్నారు. ఆదివాసీ సంఘాలు పలుమార్లు ప్రజావాణి కార్యక్రమాల్లో వినతిపత్రాలు సమర్పించినప్పటికీ పరిస్థితిలో మార్పు రావడం లేదని పేర్కొన్నారు.మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో), మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) గిరిజనేతరుల బహుళ అంతస్తుల నిర్మాణాలపై నోటీసులు జారీ చేయడం లేదని, చట్ట ఉల్లంఘనలపై చర్యలు తీసుకోవడం లేదని ఆయన ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో బహుళ అంతస్తుల భవనాలకు అనుమతులు ఎవరు ఇస్తున్నారో విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


పెనుగోలు ఆదివాసులకు కనీస సదుపాయాలేవీ?

పెనుగోలు ప్రాంతం నుంచి కిందకు తరలించిన ఆదివాసీ కుటుంబాలకు దశాబ్దాలు గడిచినా ఇప్పటికీ ఇంటి పన్నులు, ఇంటి పట్టాలు, విద్యుత్ మీటర్ల సదుపాయాలు కల్పించలేదని విద్యాసాగర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివాసీలకు కనీస సదుపాయాలు అందించడంలో నిర్లక్ష్యం చూపుతున్న అధికారులు, మరోవైపు ఏజెన్సీ ప్రాంతంలో అర్హత లేని గిరిజనేతరులకు ఇంటి పన్నులు విధిస్తూ, బహుళ అంతస్తుల నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నారని ఆరోపించారు.గత ప్రభుత్వం ఆదివాసీలకు సాగుభూములు అందిస్తామని హామీ ఇచ్చి అమలు చేయలేదని విమర్శించారు. పెనుగోలు ఆదివాసీలకు వెంటనే ఇంటి పట్టాలు, ఇంటి పన్నుల సదుపాయం, విద్యుత్ మీటర్లు కల్పించడం తోపాటు సాగుభూముల సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘించిన వారిపై, బాధ్యతలు నిర్వర్తించని అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సమావేశంలో ఏఎన్ఎస్ రాష్ట్ర సామాజిక మాధ్యమాల అధికార ప్రతినిధి పాయం అజయ్, నాయకులు బొగ్గుల నారాయణ, పాయం కమల, బొగ్గుల మల్లయ్య, అంజలి, శ్రీజన తదితరులు పాల్గొన్నారు.



పేదల కన్నీళ్లు తుడిచే నాయకుడే నిజమైన నాయకుడు

పెద్దపల్లి జిల్లా / మంథని, అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి): ప్రజల కష్టాలను చూసి చలించిపోయే హృదయం ఉన్నవాడే నిజమైన నాయకుడని, పేదల కన్నీళ్లు తుడిచి వారికి అండగా నిలిచేవారే ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని మంథని మున్సిపల్ పరిధికి చెందిన తాటి రమేష్ గౌడ్ అన్నారు. గతంలో శాసనసభలో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి మాట్లాడిన తీరును అభినందిస్తూ, ఆయన వ్యక్తం చేసిన అభిప్రాయాలు తనను ఆకట్టుకున్నాయని తెలిపారు.ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ రాజకీయాల్లో అధికారమే పరమావధిగా భావిస్తూ పేదలపై పెత్తనం చెలాయించడం, కేసులతో భయభ్రాంతులకు గురిచేయడం, పేద కుటుంబాలను ఇబ్బందులకు గురిచేయడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రజలను ఇబ్బందులకు గురిచేసే నాయకులకు భవిష్యత్తులో ప్రజాస్వామ్యబద్ధంగా ఓటు ద్వారా సమాధానం చెబుతామని స్పష్టం చేశారు. కేసులతో భయపెట్టాలని చూస్తే భయపడే ప్రసక్తే లేదని, అణచివేయాలని ప్రయత్నించిన కొద్దీ మరింత ధైర్యంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు.తమ కుటుంబం గత 30 సంవత్సరాలుగా సహాయ సహకారాలు అందించిన వారే ఇప్పుడు తమ చేతులకు సంకెళ్లు వేయించే ప్రయత్నం చేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. నమ్మకాన్ని వమ్ము చేసే రాజకీయ నాయకులకు ప్రజలే తగిన సమాధానం చెబుతారని అన్నారు. ఆత్మగౌరవాన్ని చంపుకొని బతికే ప్రసక్తే లేదని, రాజకీయ కక్షసాధింపులకు ప్రజాస్వామ్యబద్ధంగా ఓటు ద్వారా బదులిస్తామని తెలిపారు.తమ నాయకుడు పుట్ట మధు ఎప్పుడూ ఒక విషయాన్ని చెబుతుంటారని, ఏ పార్టీకి చెందిన వారైనా ప్రజలకు మంచి





చేసినప్పుడు వారిని అభినందించాలని సూచిస్తుంటారని రమేష్ గౌడ్ పేర్కొన్నారు. అదే స్ఫూర్తితో శాసనసభలో ప్రజా సమస్యలపై రాజగోపాల్‌రెడ్డి మాట్లాడిన తీరును అభినందిస్తున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలపై గొంతెత్తే నాయకులను పార్టీలు, రాజకీయాలకు అతీతంగా గుర్తించి ప్రశంసించడం ప్రజాస్వామ్యంలో మంచి సంప్రదాయమని ఆయన అన్నారు.

మహాలక్ష్మి ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ చర్ల, అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి):చర్ల మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ వెనుక నూతనంగా నిర్మిస్తున్న మహాలక్ష్మి అమ్మవారి ఆలయాన్ని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు సందర్శించారు. ఆలయ నిర్మాణ పనుల పురోగతిని కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడ నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొని ప్రసాదం స్వీకరించారు.ఈ కార్యక్రమంలో పోలీసు సీఐ రాజు వర్మ, మేజర్ పంచాయతీ సర్పంచ్ పూజారి సామ్రాజ్యం, ఆలయ కమిటీ సభ్యులు సాయల వెంకటరమణ, చింత నాగబాబు, కవ్వాల రాము, మీసాల శ్రీనివాస్, సరోజినీ, రావులపల్లి నాగలక్ష్మి, ఎదురురాడ లక్ష్మి, దోమల రాజేశ్వరి, పలువురు ప్రజాప్రతినిధులు, భక్తులు



పాల్గొన్నారు.

శ్రీదేవి నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన గుండు సుధారాణి

- చండీ హోమంలో పాల్గొన్న కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్



హనుమకొండ, అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి): హనుమకొండలోని దేశాయిపేట రోడ్డు, టీచర్స్ కాలనీ, గణేష్ నగర్‌లో ఉన్న శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో నిర్వహిస్తున్న శ్రీదేవి నవరాత్రి ఉత్సవాల్లో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్, మాజీ రాజ్యసభ సభ్యురాలు, గ్రేటర్ వరంగల్ నగరపాలక సంస్థ మాజీ మేయర్ గుండు సుధారాణి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఆలయంలో జరిగిన చండీ హోమంలోనూ ఆమె పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు గుండు సుధారాణిని శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బిల్లా కవిత శ్రీకాంత్, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం అధ్యక్షుడు పెండెం వరప్రసాద్, గౌరవ అధ్యక్షుడు విజయ భాస్కర్‌రావు, సలహాదారు కైలాసం, ప్రధాన కార్యదర్శి కే. యాదగిరి, కోశాధికారి శ్రీరాములు, మహిళా కమిటీ సభ్యులు సావిత్రి, వాణి, కవిత, శ్రీదేవి, మమత, స్వాతి, విజయ, సౌమ్యతోపాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు



భూపాలపల్లి, అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి): తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకుని భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపీఎస్ ముఖ్య అతిథిగా పాల్గొని పోలీసు కుటుంబ సభ్యులతో కలిసి వేడుకల్లో సందడి చేశారు.వివిధ రకాల రంగురంగుల పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలతో మహిళలు సంప్రదాయ దుస్తుల్లో వేడుకలకు హాజరయ్యారు. బతుకమ్మ పాటలు, ఆటపాటలు, కోలాటాలతో పోలీస్ కార్యాలయ ప్రాంగణం సందడిగా మారింది. మహిళలు ఉత్సాహంగా బతుకమ్మ ఆడుతూ పండుగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు పోలీసు కుటుంబాల మధ్య ఆత్మీయత, ఐక్యతను పెంపొందించేందుకు ఇటువంటి వేడుకలు దోహదపడతాయని అధికారులు పేర్కొన్నారు. విధి నిర్వహణలో నిరంతరం నిమగ్నమయ్యే పోలీసు సిబ్బంది తమ కుటుంబ సభ్యులతో కలిసి పండుగను జరుపుకోవడం వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నరేష్ కుమార్, డీఎస్పీలు సంపత్ రావు, సూర్యనారాయణ, రెహమాన్, సీఐలు, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది తమ కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు.

హంగారలో ఇంటి నంబర కేటాయింపునకు కొత్త విధానం



నిజామాబాద్ జిల్లా / పోతంగల్, అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి):నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలం హంగార గ్రామంలో ఇంటి నంబర్ల కేటాయింపు ప్రక్రియలో మార్పులు చేపట్టనున్నట్లు సమాచారం. గతంలో కేటాయించిన ఇంటి నంబర్లను రద్దు చేసి, ఉపగ్రహ సాంకేతికత ఆధారంగా కొలతలు నిర్వహించిన అనంతరం కొత్త నంబర్లు కేటాయించనున్నట్లు తెలుస్తోంది.గ్రామపంచాయతీ కార్యదర్శి గంగారం గతంలో కేటాయించిన నంబర్లను రద్దు చేసినట్లు సమాచారం. అయితే, ఈ నిర్ణయానికి గల కారణాలు, కొత్త విధానం అమలుకు సంబంధించిన మార్గదర్శకాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.కొత్త విధానం వల్ల ఇంటి వివరాలు, రికార్డుల పరిశీలన మరింత సులభతరం అవుతాయని భావిస్తున్నారు. పాత నంబర్ల స్థానంలో కొత్తవి ఎప్పుడు కేటాయిస్తారు, ఇప్పటికే నంబర్లు పొందిన వారికి ఎలాంటి మార్పులు ఉంటాయనే అంశాలపై గ్రామస్తుల్లో ఆసక్తి నెలకొంది. ఈ వ్యవహారంపై గ్రామపంచాయతీ అధికారులు అధికారిక ప్రకటన విడుదల చేయాల్సి ఉంది

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

భద్రాచలంలో వైభవంగా శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు



భద్రాచలం, అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి):భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో కొలువై ఉన్న శ్రీ లక్ష్మీ తాయారు అమ్మవారు రోజుకో అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఉత్సవాల్లో నాలుగో రోజైన శుక్రవారం అమ్మవారు ధాన్యలక్ష్మి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.ఈ నెల 20వ తేదీ వరకు అమ్మవారు ప్రతిరోజూ ఒక్కో అలంకరణలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. దసరా మహోత్సవం సందర్భంగా ఈ నెల 20న దసరా మండపంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా శమీ పూజ, ఆయుధ పూజతోపాటు శ్రీరామలీల మహోత్సవ వేడుకలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి అలంకరణల దర్శనంతోపాటు ఆలయంలో శ్రీరామాయణ పారాయణ కార్యక్రమం కూడా కొనసాగుతోంది. సుమారు వందమంది భక్తులతోపాటు ఆలయ వేద పండితులు ప్రతిరోజూ ఈ పారాయణంలో పాల్గొంటూ భక్తిభావాన్ని చాటుతున్నారు. శరన్నవరాత్రి ఉత్సవాలతో భద్రాచల ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.

సరస్వతీ మాత రూపంలో దర్శనమిచ్చిన దుర్గమ్మ





పెద్దపల్లి జిల్లా / మంథని, అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి): మంథని పట్టణంలో రెబల్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపం వద్ద శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా దుర్గమ్మను సరస్వతీ మాత రూపంలో అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.అనంతరం అంతర్జాతీయ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మేడగోని వెంకటేష్ గౌడ్, భవాని బేకరీ స్వీట్స్ హౌస్‌కు చెందిన భీముని విక్కీ గౌడ్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ కార్యక్రమానికి సహకరించిన దాతలకు, సేవలందించిన స్వచ్ఛంద సేవకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అమ్మవారి కృపతో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని, ప్రతి ఒక్కరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు.“అమ్మవారి దయ ఉంటే అన్నీ ఉన్నట్లే. అందరూ బాగుండాలి.. అందరికీ మంచి జరగాలి. మానవసేవే మాధవసేవ.. ఇదే సనాతన ధర్మ పరమార్థం” అని నిర్వాహకులు పేర్కొన్నారు.

పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లకు భరోసా..

- **97 మందికి కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ**





నిత్యం నిఘా, వికారాబాద్, అక్టోబర్ 16 : వికారాబాద్: పట్టణానికి చెందిన 97 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల కింద ఆర్థిక సాయం అందజేశారు. తెలంగాణ శాసనసభాపతి, వికారాబాద్ శాసనసభ్యుడు గడ్డం ప్రసాద్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఒక్కో లబ్ధిదారునికి రూ.1,00,116 చొప్పున మొత్తం రూ.97,11,252 విలువైన చెక్కులను అందజేశారు. పేద కుటుంబాలకు చెందిన ఆడబిడ్డల వివాహాలకు ఈ పథకాలు ఆర్థికంగా అండగా నిలుస్తున్నాయని ప్రసాద్ కుమార్ పేర్కొన్నారు. పేద ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య, వైస్ చైర్మన్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు అర్థ సుధాకర్ రెడ్డి, రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యుడు కాకి రంగరాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్ ముదిరాజ్, వైస్ చైర్మన్ మల్లేశం, కౌన్సిలర్లు కాకి విజయలక్ష్మి, వినోద్ కుమార్, రాకేష్, లక్ష్మీకాంత్ రెడ్డి, చిల్లపల్లి రమేష్ కుమార్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

జీడబ్ల్యూఎంసీ ఆవరణలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

- **కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి వేడుకల్లో పాల్గొన్న గుండు సుధారాణి**



హనుమకొండ, అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి):బతుకమ్మ పండుగను పురస్కరించుకుని శుక్రవారం సాయంత్రం గ్రేటర్ వరంగల్ నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన వేడుకలు ఉత్సాహంగా సాగాయి. హనుమకొండ జిల్లా కలెక్టర్, నగరపాలక సంస్థ ప్రత్యేక అధికారి చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్‌పర్సన్, మాజీ రాజ్యసభ సభ్యురాలు, నగరపాలక సంస్థ మాజీ మేయర్ గుండు సుధారాణి పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు.సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ఈ వేడుకల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొని బతుకమ్మ పాటలు పాడుతూ సందడి చేశారు. పండుగ వాతావరణంతో నగరపాలక సంస్థ ఆవరణ కళకళలాడింది.ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ కమిషనర్ టి. వెంకన్న, అదనపు కమిషనర్ జోన, ఉప కమిషనర్ ప్రసన్నారాణితో పాటు అధికారులు, మహిళా అధికారులు, ఉద్యోగులు, ఆర్‌పీలు, పలువురు మహిళలు పాల్గొన్నారు.

విదేశీయుల రాకపోకల వివరాల నమోదు తప్పనిసరి

- వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఐపీఎస్



వరంగల్, అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి):వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విదేశీయులకు వసతి కల్పించే హోటళ్లు, వసతి గృహాలు, అద్దె ఇళ్ల యజమానులు, విద్యా, వైద్య సంస్థల నిర్వాహకులు వారి రాకపోకల వివరాలను తప్పని సరిగా నమోదు చేయాలని పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత సూచించారు. ఇమ్మిగ్రేషన్ అండ్ ఫారినర్స్ చట్టం–2025లోని సెక్షన్ 8 ప్రకారం, విదేశీ పౌరులు, ఓసీఐ కార్డుదారులు, నేపాల్, భూటాన్ దేశస్థులు సహా విదేశీయులు వచ్చిన లేదా వెళ్లిన 24 గంటల్లోపు ఆన్‌లైన్ పోర్టల్‌లో ఫారమ్–3 ద్వారా వివరాలు నమోదు చేయాలని స్పష్టం చేశారు.నిర్దేశిత సమయంలో వివరాలు నమోదు చేయకపోతే చట్టంలోని సెక్షన్ 23(బి) ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉందని కమిషనర్ హెచ్చరించారు. వ్యక్తిగత, వాణిజ్య వసతి నిర్వాహకులకు ప్రతి ఉల్లంఘనకు కనీసం రూ.50 వేల జరిమానా విధించవచ్చని, విద్యా, వైద్య సంస్థలకు కనీసం రూ.లక్ష జరిమానాతో పాటు నేర విచారణను ఎదుర్కోవాల్సి రావచ్చని తెలిపారు.కాబట్టి సంబంధిత వసతి నిర్వాహకులు, విద్యా, వైద్య సంస్థల యాజమాన్యాలు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, విదేశీయుల వివరాల నమోదులో నిర్లక్ష్యం వహించవద్దని పోలీస్ కమిషనర్ సూచించారు.

వర్ధన్నపేట పోలీస్ స్టేషన్‌లో నూతన ఎస్‌హెచ్‌ఓగా ప్రవీణ్ భోగం బాధ్యతల స్వీకరణ



వరంగల్/వర్ధన్నపేట, అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి):వరంగల్ జిల్లా వర్ధన్నపేట పోలీస్ స్టేషన్ నూతన స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)గా ప్రవీణ్ భోగం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట జర్నలిస్టుల బృందం ఆయనను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపింది.ఈ సందర్భంగా పోలీసు శాఖకు, మీడియాకు మధ్య సమన్వయం ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమని జర్నలిస్టులు పేర్కొన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో మీడియా తన బాధ్యతను నిర్వర్తిస్తుండగా, ప్రజలకు రక్షణ కల్పించడం, శాంతిభద్రతలను పరిరక్షించడంలో పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు.వర్ధన్నపేట ప్రాంతంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నూతన ఎస్‌హెచ్‌ఓ ప్రవీణ్ భోగంను జర్నలిస్టుల బృందం కోరింది. అసాంఘిక కార్యకలాపాల నియంత్రణతో పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ, చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేసి పోలీసు శాఖపై ప్రజల్లో మరింత నమ్మకాన్ని పెంపొందించాలని ఆకాంక్షించింది

సరస్వతీ దేవి అవతారంలో కొలువుదీరిన దుర్గామాత





వరంగల్/ వర్ధన్నపేట, అక్టోబర్ 16 (నిత్యం నిఘా ప్రతినిధి):వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం కొత్తపల్లి గ్రామంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సరస్వతీ దేవి అవతారంలో కొలువుదీరిన దుర్గామాత భక్తులకు దర్శనమిచ్చారు. జ్ఞానప్రదాయిని సరస్వతీ దేవి రూపంలో అమ్మవారు దర్శనమివ్వడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.దుర్గామాత ఉత్సవ కమిటీ, దేవస్థాన చైర్మన్ కమ్మగోని సుధాకర్ గౌడ్ ఆధ్వర్యంలో ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్తపల్లి గ్రామానికి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.ఆలయ అర్చకులు వేదమంత్రాల నడుమ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అమ్మవారికి హారతి సమర్పించారు. సరస్వతీ దేవి అలంకారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ఆధ్యాత్మిక ఆనందంలో మునిగిపోయారు. మహిళల సందడి, భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం కళకళలాడింది.దేవీ నవరాత్రి ఉత్సవాలు భక్తి, శక్తి, ఆధ్యాత్మికతకు ప్రతీకగా కొనసాగుతున్నాయని గ్రామస్థులు పేర్కొన్నారు. కమ్మగోని సుధాకర్ గౌడ్ ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహిస్తుండటంపై గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అమ్మవారి కృపాకటాక్షాలు గ్రామ ప్రజలందరిపై ఉండాలని భక్తులు ప్రార్థించారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com